అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

- పంట దిగుబడి రాక 6 లక్షల రుణ భారం
- అందని రైతు భరోసా, ఎండిన పంటతో మనస్తాపం

చింత సారయ్య (ఫైల్)

ఐనవోలు, మార్చి 29: అప్పుల బాధతో ఓ కౌలు రైతు విషగుళికలు మింగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఐనవోలు మండల కేంద్రానికి చెందిన చింత సారయ్య(47) తనకున్న ఎకరం న్నర భూమితోపాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. 2 ఎకరాల్లో వరి, ఎకరంలో మక్కజొన్న, ఎకరంలో కూరగాయలు సాగుచేశాడు. రెండు మూడేండ్ల నుంచి పంట పెట్టుబడికి సుమారు రూ.6 లక్షల అప్పులయ్యాయి. వాతావరణం అనుకూలించక.. పంట దిగుబడి సరిగా రాక.. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు సామ్యూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

కరువు రైతుకు బాసటగా..

మూడో పేజీ తరువాయి...

నిరూపిస్తున్నదని ఆ పార్టీ శ్రేణులు చెప్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమై, చిక్కిశల్యమైపోయిన వ్యవసాయాన్ని పదేండ్ల కఠోర శ్రమతో దరికి చేర్చిన బాధ్యతాయుతమైన పార్టీగా, ఆ పార్టీకి సారథ్యం వహిస్తున్న తెలంగాణ సాధకుడిగా.. కేసీఆర్ రైతులకు ధైర్యాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నారని అందుకే జిల్లాల పర్యటన తలపెట్టారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. అందులో భాగంగానే రైతు కేంద్రంగా తాము పోరుపతాక ఎగురవేస్తున్నామని గులాబీదళం స్పష్టం చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలుపుకోని కారణంగానే రాష్ట్ర రైతాంగం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని, ఈ తరుణంలో రైతులకు బాసటగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని నమ్మించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా హామీలను అమలు చేయకపోగా మరింత కుంగదీసే చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ విమర్శిస్తున్నది. రైతులకు అండగా నిలిచేందుకు ఆదివారం నుంచి కేసీఆర్ జిల్లాల్లో పర్యటిస్తారని పార్టీ స్పష్టం చేసింది. ఇప్పటికే రైతుల కోసం అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించడంతోపాటు రైతులను ఆదుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఓవైపు సాగునీరు అందక ఎండుతున్న పంటలు.. మరోవైపు అకాల వర్షాలతో అల్లాడుతున్న రైతాంగం.. సకాలంలో అందని రైతుబంధు.. వీటికితోడు రైతులకు బ్యాంకుల నోటీసులు.. ఒక్కసారిగా చుట్టుముట్టిన కష్టనష్టాలను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులు.. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుభరోసా కింద రైతులు, కౌలురైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడిసాయం, అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ తదితర హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను నల్లగొండ, కరీంనగర్ సభల్లో ఎలుగెత్తి చాటినప్పటికీ, ప్రభుత్వం స్పందించని కారణంగానే క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సి వస్తున్నదని బీఆర్ఎస్ నేతలు వివరిస్తున్నారు.

31న కేసీఆర్ పర్యటించే జిల్లాలివే

నీళ్లందక ఎండిపోతున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కరువుతో అల్లాడుతున్న రైతాంగానికి ధైర్యాన్ని నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లాల పర్యటనలు చేయనున్నారు. అందులో భాగంగా ఈ నెల 31న జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. పంటపొలాలను పరిశీలించి, రైతులకు ధైర్యాన్ని ఇవ్వనున్నారు. ముందుగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో పర్యటిస్తారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని అర్వపల్లికి వెళ్తారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లా హాలియా మండలంలో పర్యటించి రైతులకు మనోధైర్యం ఇవ్వనున్నారు.

రైతన్న కోసం ద్విముఖ వ్యూహం

సమస్యల పరిష్కారంలో అధికారపక్షం విఫలమైనచోట ప్రతిపక్షాలు పోరుబాటను ఎంచుకోవడం సహజం. అందులో భాగంగానే రైతన్నకు ధైర్యాన్ని ఇవ్వడం, ప్రభుత్వాన్ని మేల్కొల్పడం అనే ద్విముఖ వ్యూహాన్ని బీఆర్ఎస్ ఖరారు చేసింది. రైతులెవరూ ఆత్మహత్యల కు పాల్పడకూడదని, ప్రభుత్వం మెడలు వంచి రైతులను ఆదుకుంటామని బీఆర్ఎస్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఎక్కడికక్కడ బీఆర్ఎస్ శ్రేణులు రైతుల దగ్గరికి వెళ్లి వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ వేసిన పంటల విస్తీర్ణం, ఎండిన పంట విస్తీర్ణం, రైతుల స్థితిగతులను బేరీజు వేసి గ్రామాలు, మండలాలవారీగా తెలంగాణభవన్‌కు సమాచారం పంపిస్తే దానిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని బీఆర్ఎస్ ఇప్పటికే ప్రకటించింది.

పిరికిపందలకు బీఆర్ఎస్‌లో చోటు లేదు

- కష్టకాలంలో పార్టీని వీడటం నాయకుడి లక్షణం కాదు
- బీఆర్ఎస్‌లో అలాంటి వారికి స్థానం ఉండకూడదు
- ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీని వీడను: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మార్చి 29(నమస్తేతెలంగాణ): వెన్నుపోట్లు, ద్రోహాలు, కుట్రలు, దాడులను ఎదుర్కోవటం బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదని, ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ స్థానం ఉన్నంత వరకు ఏమీ కాదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు విలువైన సమయాన్ని వృథా చేయకుండా, ఎంతటి త్యాగానికైనా వెనుకాడకుం డా, నమ్ముకున్న ప్రజల వద్దకు వెళ్లి, వాస్తవాలను వివరించి తెలంగాణ ద్రోహుల చెంప చెల్లుమనిపించేలా విజయభేరి మోగిద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్విట్టర్ వేదికగా స్పం దించారు. 'కడియం శ్రీహరి, కే కేశవరావు అకస్మాత్తుగా పార్టీని వీడిన నేపథ్యంలో వారి బాటలోనే నడిచి మంచి దారి వెతుక్కోవాలని కొంతమంది, పార్టీని వీడొద్దు.. అండగా నిలబడాలని ఇంకొందరు నన్ను కోరారు. కార్యకర్తలెవరూ టెన్షన్ పడవద్దు. గెలుపుతో వచ్చే అధికార ఫలాలను అనుభవించినప్పుడు, ఓటమితో వచ్చే కష్టాలను కూడా భరించగలిగేవాడే నిజమైన పార్టీ నాయకుడు. అలా కాకుండా ప్రతిదానికి భయపడే పిరికిపందలకు బీఆర్ఎస్ లాంటి ఉద్యమ పార్టీల్లో స్థానం ఉండకూడదు. నేను గొర్రెను కాదు. కాలేను. ఇంకెక్కడికో పోవాలన్న ఆలోచన కూడా లేదు. ఎన్ని ప్రలోభా లు పెట్టినా పార్టీని వీడే ప్రసక్తే లేదు. నేను గతంలో చేసిన బీఎస్పీ–బీఆర్ఎస్ కూటమి ప్రయత్నమైనా, తర్వాత బీఆర్ఎస్‌లో చేరాలన్న నిర్ణయమై నా చాలా ఆలోచించి తీసుకున్నది. నేను రాజకీయాల్లోకి వచ్చింది నా సొంత పిల్లల రాజకీయ భవిష్యత్తు కోసమో, అక్రమ ఆస్తుల కోసమో, పోలీసు కేసులకు భయపడో, హంగులు, ఆర్భాటాలున్న జీవితం కోసమో, ప్రోటోకాల్ కోసమో కాదు. నేను పుట్టి పెరిగిన సమాజం చాలా వేదనతో వెనకబడి ఉన్నది. వాళ్ల కోసం చట్టసభల్లో ఒక గొంతుకగా బతికి, వాళ్ల జీవితాలను శక్తి మేరకు సమూలంగా మార్చాలని రాజకీయాల్లోకి వచ్చా' అని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే బహుజనవాదం, తెలంగాణవాదం రెండూ కలవాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్నదని నమ్మినట్లు తెలిపారు. అందుకే కొత్త తెలంగాణకు బలమైన పునాది వేసిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌ను ఎంచుకున్నట్టు వివరించారు. 'దేశం లో, రాష్ట్రంలో అధికార పార్టీలు పోలీస్ కేసులు, కట్టుకథలను ఆయుధాలుగా వాడి రాజకీయ ప్రత్యర్థులను నామరూపాలు లేకుండా చేయడం ప్రస్తు తం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్. దీన్ని ధైర్యంగా సర్వశక్తులొడ్డి అధిగమించిననాడే దేశంలో ప్రజాస్వామ్యం నిలుస్తుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎవరైనా క్షమించరాని నేరానికి పాల్పడితే వారి మీద తప్పకుండా చట్ట ప్రకారం చర్యతీసుకోవాలి. దీనిని ఎవరూ కాదనరు. కానీ వాస్తవాలను వక్రీకరించి సోషల్ మీడియా వేదికగా, అసభ్యకరమైన శీర్షికలతో రాజకీయ ప్రత్యర్థుల మీద జరుగుతున్న కుట్రపూరిత దాడులను తిప్పికొట్టాలి' అని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎంపీ టికెట్లలో మాదిగలకు అన్యాయం

- ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద మాదిగ సంఘాల నిరసన

ఎంపీ టికెట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరిగిందంటున్న మాదిగ సంఘం నేత

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎంపీ టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేసిందని మాదిగ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద తెలంగాణకు చెందిన పలు మాదిగ సంఘాలు నిరసన వ్యక్తంచేశాయి. ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌ధురి, బిజేంద్రసింగ్‌ను ఆయా సంఘాల నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి అభ్యర్థిని మార్చి గజ్జెల కాంతంకు అవకాశం ఇవ్వాలని, వరంగల్ టికెట్‌ను మాదిగలకు ఇవ్వాలని, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పిడమర్తి రవికి కేటాయించాలని డిమాండ్ చేశారు. 18 లక్షలు ఉన్న మాల సామాజికవర్గానికి ఎక్కువ సీట్లు కేటాయించారని, 80 లక్షలకుపైగా ఉన్న మాదిగలకు అన్యాయం చేశారని వివరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను కూడా కలిసి జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని చెప్పారు.

కాంగ్రెస్ పాలన అంటేనే కరువు

కేసీఆర్ మీద కోపంతో రైతులను శిక్షిస్తారా?

- మంత్రులకు దమ్ముంటే ఎండిన పొలాలు పరిశీలించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సవాల్
- తుంగతుర్తి మండలంలో ఎండిన పంటల పరిశీలన

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి, మార్చి 29 : కాంగ్రెస్ పాలన అంటేనే కరువు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక ఆయన మీద కోపంతో రైతులను శిక్షిస్తున్నారని మండిపడ్డారు. రైతులపై కక్ష గట్టిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి, సింగారంతండా, మొండికుంట తండాలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతో కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టును నిష్ప్రయోజనం చేశారని ఆరోపించారు. నీటిని ఎత్తిపోసి కష్టకాలంలో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్లే వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు వ్యవసాయం పండుగలా సాగిందని, ఇప్పుడు రైతులకు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల వారిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడానికి గేట్లు ఎత్తడం కాదని, సాగర్ గేట్లు ఎత్తి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు కరువు ఎలా తాండవించిందో ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ పాలనలో అదే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నీళ్లు లేక కాళేశ్వరం, ఎస్సారెస్పీ ఆయకట్టు ఎడారిలా మారిందని అన్నారు. ఎండిన పంట పొలాలను ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే గానీ వెళ్లి పరిశీలించలేదని చెప్పారు. మంత్రులకు దమ్ముంటే క్షేత్రస్థాయిలో ఎండిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకోవాలని సవాల్ విసిరారు. ప్రకృతి తెచ్చిన కరువు కంటే పాలకుల నిర్లక్ష్యం వల్లే ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. కాళేశ్వరం నీటిని ఎత్తిపోస్తే నేడు రైతులు ఈ దీనస్థితికి చేరుకునేవారు కాదని అన్నారు. కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, ఎస్సారెస్పీ ఫేజ్ 2 కింద నీళ్లు ఇస్తామని చెప్పి మరీ రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. 15 రోజులు పూర్తి స్థాయిలో ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు రాకపోతే పంట పొలాలు ఎండిపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంటుందని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు ప్రభుత్వం రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నీతయ్య ఉన్నారు.

గంగాధర మండలం కురిక్యాల వరదకాలువ వద్ద రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు, రైతులు

వరదకాలువకు నీళ్లివ్వాలని రాస్తారోకో

- కురిక్యాల వరదకాలువ వద్ద బీజేపీ నిరసన

గంగాధర, మార్చి 29: వరద కాలువకు నీటిని విడుదల చేసి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల వరదకాలువ వద్ద జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై రైతులతో కలిసి బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్ మాట్లాడుతూ.. వరద కాలువను నమ్ముకొని రైతులు వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేసినట్టు తెలిపారు. కాలువలో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వరద కాలువకు నీళ్లివ్వాలని, రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు.

ముథోల్ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ నియామకం

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ముథోల్ అసెంబ్లీ నియోజవర్గానికి బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీని నియమించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కమిటీ సభ్యులను ప్రకటించారు. సమన్వయ కమిటీలో రమాదేవి, లోలం శ్యాంసుందర్, విలాశ్ గాదేవర్, డాక్టర్ కిరణ్ కమ్వేవర్ ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నియోజకవర్గంలో అన్ని స్థాయిల కార్యకర్తలు, నాయకుల సమన్వయం తదితర అంశాలను ఈ కమిటీ పర్యవేక్షించనున్నది.

సాగునీటి కోసం చెలిమెలు

మానుకోట జిల్లాలో రైతుల దుస్థితి

కౌసల్యదేవిపల్లిలో ఆకేరు వాగులో చెలిమె నీటి కోసం ఇసుకలో గుంత తీస్తున్న రైతు నారాయణ

నర్సింహులపేట, మార్చి 29 : యాసంగి పంటలు సాగు చేసిన రైతులు వాటిని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఆకేరువాగులో సాగునీరు లేక పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఆకేరు వాగు శివారు గ్రామాలైన కొమ్ములవంచ, జయపురం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, ముంగిమడుగు గ్రామాల్లోని ఆకేరును నమ్ముకొని వేసిన వరి పొలాలు ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నారు. 50 ఏండ్లలో ఇలాంటి కష్టాలు చూడలేదని రైతులు వాపోతున్నారు. కౌసల్యదేవిపల్లి గ్రామంలోని ఎర్పుల కొమురయ్య, నారాయణ, శ్రీరాములు, వీరన్న పొత్తుల ఉన్న బావిలో నీరు లేక ఆకేరువాగులో రింగులు వేసినా నీరు లభించడంలేదు. దీంతో జేసీబీతో మూడు సార్లు చెలిమెను లోతు తీస్తే అరగంట నీరు వస్తే మరో అరగంట నీటి కోసం వాగులో ఎర్రటి ఎండలో కమ్మల గుడిసె వేసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

మహబూబాబాద్ జిల్లా జయపురంలో ఎండిపోయిన వరి

పొలం ఎండకుండా తడుపుతున్నం

నాకు 60 ఏండ్లు. 45 ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్న. సాగునీటి కోసం ఎప్పుడూ తప్పలు పడలే. బావిలో నీరు తక్కువ కావడంతో పూడిక తీస్తే రూ.50 వేలు అయినయ్. వాగులో మూడుసార్లు గుంత లోతు తీపిస్తే రూ.21 వేలు ఖర్చయింది. అయినా నీళ్లు రాక పోవడంతో రోజూ చెలిమె నీటి కోసం ఇసుక తోడుతున్నం. 20 నిమిషాలు మోటరు నడిస్తే ఇంకో 20 నిమిషాలు ఆపుతున్నం. ఇలా ఎర్రటి ఎండలో వాగు పక్కన సర్కార్ తుమ్మ చెట్ల కింద ఉంటున్నం.

- పర్పుల నారాయణ, కౌసల్యదేవిపల్లి

బీఆర్ఎస్ ప్రజల పార్టీ

మూడో పేజీ తరువాయి...

మాట్లాడారు. తాను నాడు కాంగ్రెస్‌ను, నేడు బీఆర్ఎస్‌ను ఎందుకు వీడాల్సి వచ్చిందో వివరించారు. తెలంగాణ కోసం విద్యార్థులు చనిపోతుంటే, కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వటంలో తాత్సారం చేస్తున్న సమయంలో పార్టీకి, తనకు కొంత చెడిందని తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఫోరమ్ ఫర్ తెలంగాణ (సీఎఫ్‌టీ) ఏర్పాటు చేశామని వెల్లడించారు. తెలంగాణ ఇవ్వకపోతే టీఆర్ఎస్‌లో చేరతానని సోనియాకు నేరుగా చెప్పానని అన్నారు. ప్రజల్లో కేసీఆర్ భారీస్థాయి ఉద్యమాన్ని తీసుకొస్తున్నారని, ఇవ్వకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని కూడా సోనియాతో చెప్పినట్టు వివరించారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ముందుండి నడపటంతో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని తెలిపారు.

దేశం గర్వించేలా తెలంగాణ అభివృద్ధి

స్వరాష్ట్రం సిద్ధించిన వెంటనే 'తెలంగాణను పునర్మించాలి' అని కేసీఆర్ పిలుపునిచ్చారని, ఆయన పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరానని కేకే చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో తెలంగాణ దేశం మొత్తం గర్వించేలా గొప్పగా తయారైందని వెల్లడించారు. ఒకనాడు చాలా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న తెలంగాణ.. నేడు అభివృద్ధి, జీడీపీ, తలసరి, కరెంటు, ఇరిగేషన్, వ్యవసాయం, ఐటీ ఎగుమతులు వంటి అన్ని రంగాల్లో మొదటిస్థానంలో ఉన్నదని వివరించారు. ఈ ఘనత కేసీఆర్‌దేనని, దాన్ని తాను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రాన్ని ఇంత గొప్పగా అభివృద్ధి చేసినా, బీఆర్ఎస్ ఓడిందంటే నమ్మశక్యంగా లేదని, బాధగానూ ఉన్నదని అన్నారు. ఓటమికి గల కారణాలు కూడా తెలుసుకోవాలని సూచించారు.

సొంతింటికి వెళ్తున్నా

ఇన్నేండ్ల రాజకీయ తీర్థయాత్ర తర్వాత తాను సొంతగూటికి వెళ్లాల్సిన టైమ్ వచ్చిందని, ఆ ఘర్ వాపసీ సమయం ఇదేనని కేకే అన్నారు. అందుకే కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యం, కాంగ్రెస్ ప్రమాదంలో ఉన్నాయని అందుకే పార్టీ మారుతున్నట్టు తెలిపారు. తాను ఎప్పటికీ బీఆర్ఎస్‌ను గౌరవిస్తానని స్పష్టం చేశారు. తాను ఎక్కడున్న కాంగ్రెస్‌కు లాయల్టీగానే ఉన్నానని వెల్లడించారు. తెలంగాణ రావటం, అభివృద్ధి చెందటంలో ఎలాంటి అనుమానం లేదని స్పష్టం చేశారు. '85 ఏండ్ల వయసులో ఘర్‌వాపసీ అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలో లేకపోతే వెళ్లేవారా?' అని ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు పొంతన లేని సమాధానం చెప్పారు. ఒకింత అసహనానికి గురయ్యారు.

కేసీఆర్ ఇచ్చిన మర్యాద ఎవ్వరివ్వలే

85 ఏండ్ల వయసులో, ప్రజాజీవితంలో 65 ఏండ్లుగా ఉన్న తనకు బీఆర్ఎస్ ఇచ్చినంత మర్యాద, కేసీఆర్ ఇచ్చినంత గౌరవం మరెవ్వరూ ఇవ్వలేదని కేకే చెప్పారు. బీఆర్ఎస్ కోసం పని చేసే చాలామంది ఉన్నత విద్యావంతులు అని కొనియాడారు. కొత్తగా చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తలసాని, కడియం, బాల్క సుమన్, క్రిశాంక్ వంటి ఎందరో విద్యావంతులు, పీహెచ్‌డీ చేసినవాళ్లు పార్టీలో ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను ఎవ్వరూ చాలెంజ్ చేయలేరని స్పష్టం చేశారు. 'వారు చాలా టాలెంటెడ్. వాళ్లు ఎప్పుడూ పనిలోనే నిమగ్నమవుతారు. 24 గంటలూ ఇచ్చిన పనిని పూర్తి చేయటంలోనే ఉంటారు' అని కొనియాడారు. కాంగ్రెస్‌లోకి వెళ్తున్న విషయాన్ని కేసీఆర్‌కు చెప్పానని, ఆయన కూడా చాలా మర్యాదగా మాట్లాడుతూ కొన్ని రోజులు ఆగితే బాగుండు అని అన్నారని చెప్పారు. 'నాకు కేసీఆర్, కేటీఆర్ చాలా మంచి చేశారు. నేను వారితో ఫైట్ చేయను. నేనేమైనా తప్పులు చేసుంటే క్షమించండి' అని అన్నారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్‌లో తేజూ నాయక్ వ్యవసాయ బావిలో పూడిక తీస్తున్న జేసీబీ

దినదిన గండంగా వరి సాగు

నీటి కోసం భగీరథ ప్రయత్నం

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన రైతు తేజు నాయక్ నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. కానీ ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది నీటికి లోటు వచ్చింది. ఈయన పొలానికి కొద్ది దూరంలో గుట్టల వెనుకున్న గోదావరి కొన్నేండ్లుగా నిండుకుండలా ప్రవహిస్తున్నది. కానీ ఈ ఏడాది కాళేశ్వరం జలాలు ఎత్తిపోసే అవకాశం లేకపోవడం, పైన ఉన్న కడెం ప్రాజెక్టు నుంచి నీరు రాకపోవడంతో గోదావరిలో నీటి శాతం తగ్గింది. దీంతో మండే వేసవిలోనూ నిండుగా ఉండే తేజునాయక్ బావి ఎండిపోయింది. నాలుగేండ్ల క్రితం బావి తవ్విస్తే బండరాయి పడిందని వదిలేశారు. అప్పటి నుంచి ఆ బొంద అలాగే ఉంటూ వస్తుంది. కానీ గడిచిన నాలుగేండ్లలో అది ఎప్పుడూ ఎండిపోలేదు. ఈ సారి మాత్రం పక్కనున్న గోదావరిలో నీరు లేక బావి బొంద అడుగంటింది. దీంతో నాలుగెకరాల్లో వేసిన వరిని కాపాడుకునేందుకు తేజు నాయక్ భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. బండరాయి ఉందని తెలిసినా బావిని జేసీబీతో తవ్విస్తున్నాడు. కొద్దిగా తవ్వగా వచ్చిన మురుగు నీటినే వరికి వదులుతున్నాడు. ఇందుకోసం పొలం దగ్గరే ఎవరో ఒకరు నిత్యం కాపాలా ఉండాల్సి వస్తున్నదని, ఇలా దినదిన గండంగా సాగు చేస్తున్నామని ఆయన వాపోతున్నాడు. ఒక్క రోజు నీరు లేకున్నా చేతికి వచ్చే దశలో ఉన్న పంట నాశనమైపోతుందని తేజునాయక్ బాధపడుతున్నాడు.

- మంచిర్యాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి

92% మందికి రైతుబంధు పంపిణీ

రుణమాఫీపై బ్యాంకులతో చర్చలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 29(నమస్తే తెలంగాణ): యాసంగి పంట పెట్టుబడి సాయం కింద ఇప్పటివరకు 92.68% మంది రైతులకు రైతుబంధు పంపిణీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వరకు 64.75 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసినట్టు వెల్లడించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలపై వ్యవసాయ శాఖ సర్వే చేస్తున్నదని, ఆ వివరాలు రాగానే ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందజేస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రకారం ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఇందుకోసం సంబంధిత బ్యాంకులతో కలిసి విధి విధానాల రూపకల్పనపై చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

కేటీఆర్‌పై సంగెంలో ఫిర్యాదు

సంగెం, మార్చి 29 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వరంగల్ జిల్లా సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఫ